


# అల్పజీవి

ద్వివేదుల సోమనాథశాస్త్రి

ఆ రోజున ప్రొద్దున్నే వర్షం మొదలయింది. హోరున ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. పంచపాళీల నుండి వర్షపు ధారలు త్రాళ్ళు వ్రేలాడ దీసినట్లు కనబడుతున్నాయి.

ఎక్కడచూసినా నీటి గలగలలే. ఎటు చూసినా నీటి ధారలే! ఆ ధారలక్రింది నీటి కోసం పెట్టిన గిన్నెలూ, బిందెలూ, వింత వింత శబ్దాలు చేస్తున్నాయి.

పిల్లలకెంత సరదావో! ఎంత వర్షం టున్నా యీ యింటిలోనుండి ఆ యింటి లోనికి. ఆ గుమ్మలో నుండి యీ గుమ్మం లోనికి పరిగెడుతూ తడుస్తున్నారు! నీటి ధారలమధ్య చేతులు పెట్టి నీరు తుళ్ళుగా వుంటే ఆనందిస్తున్నారు.

ఎదురుగా చెట్టుమీద రెక్కలు తడిసిన కాకులు, ఆకులమధ్య ముడుచుకు పోయి బుద్ధిగా కూచున్నాయి.

ఇవతలివాకిట్లో కాలవనీళ్ళలో, కాగితం పడవలు వేస్తూ, అవి మునిగిపోతూవుంటే కేకలు వేస్తూ చప్పట్లు చరుస్తున్నారు, మూడేళ్ళ లక్ష్మి; ఎనిమిదేళ్ళ రామం.

"వంటిల్లంతా ఉరిసిపోతుందర్రా — ఈమారయినా తిరగ వేయించకపోతే, ఎందుకూ పనికిరాదు." అని వాళ్ళ నాయనమ్మ అవతలనుండి అరుస్తోంది.

గదిలో కూడ వురుస్తోంది కాబోలు, పక్కలూ అవీ సర్దుతోంది అమ్మ.

"అలా నీళ్ళలో తడవకండర్రా పిల్లలూ! నాన్నగారితో చెప్పమన్నారా వస్తారా" అని అంటూ.

వర్షంతో వేడి, వేడినీళ్ళు పోసుగుంటు న్నారు వాళ్ళ నాన్నగారు.

అలాటప్పుడు ఒక గొంగళీ పురుగు, పూర్తిగా తడిసిపోయి పంచకింద కొట్టుకుపోతూ. మధ్య మధ్య నేలను గట్టిగా అదుముకొని వర్షం బారినుండి తప్పించుకొని పొడి జాగాకి పోదామా!? ఏ ఆకునో ఏ కొమ్మనో కరచుకొని రక్షించుకుందామా అని తాపత్రయ పడుతూంది.

అందరూ చూశారు.

"పాపం గొంగళి పురుగు ఎంత బాధ

పడుతుందో? అనుకున్నారు. అంతేగా ఎవళ్లూ తీసి ఒక ఒడ్డున చేర్చిన పాపాన పోలేదు. ఒక మనిషేగాని అలా తడిసి పోతూవుంటే. చూస్తూ వూరుకోగలరా మనిషికేం! తడిసినా బాధలేదు, కాకపోతే కాస్త రొంప చేస్తుంది: కావలిస్తే కొంప కిందయినా తలదాచు కొంటాడు! వర్షం బారినుండి తప్పించుకోగలడు.

కాని గొంగళీ పురుగు! నీళ్ళు బాగాకి ప్రాకలేయి అక్కడ వర్షం ధారలకి తట్టుకోలేక మళ్ళీ నీళ్ళలో కొట్టుకు పోతూవుంది.

దానికి జీవన్మరణ సమస్య ఇది—

జలపాతంలో ఈతరాని మనుష్యుడు పడి కొట్టుకుపోతూ, బండరాళ్ళని పట్టుకొని జారిపోతూ, నిరాశతో మరో రాయో, రవ్వో, చెట్టో, కొమ్మో! ఏదైన దొరకు తుందా ప్రాణం రక్షించుకొందామా! అనే ఆ జీవుడి ఆత్రుత భయం. యీ చిన్న జీవులిలోను కూడా వుంటుందనిపించేను.

జోరుగా వర్షం పడుతుంటే, వెచ్చగా రగ్గు కప్పుకొని దూరం నుండి-నీటిధారల క్రింద పరుగెట్టే నీటి బుడగలను, కొంత దూరం పోయి అవి బ్రద్దలవుతుంటే చూస్తూ వుండడం పెద్దవాడు కృష్ణకి సరదా తడిస్తే అవలే పడదు వాడికి.

వాళ్ళ యింట్లో, పాదులూ, పూల మొక్కలూ వున్నాయి. యీ గొంగళీ పురుగు పట్టి వాటిని సర్వనాశనం చేస్తూ వుంటాయి. ప్రతిఏడాదీ! నీటి బారినుండి మొక్కలని ఎలా రక్షించడమా అన్నది ఆ యింట్లో సమస్య. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వాటి కాలం వచ్చేసరికి అవి మాత్రం వదలవు. ఇంక భరించలేక కష్ట పడి పెట్టిన పాదులు కాపుకు వచ్చేసరికి తినేస్తూ వుంటే చూడలేక కసపడిన గొంగళీ లని రాయితోనో కర్రతోనో చంపివేయడం కూడా జరిగిపోతూ వుంది.

పోనీ మొక్కలతో ఆగుతాయా కోట మీదకి దండయాత్ర సాగించేసి పాయిల్లా, గోడనిండా ప్రాకుతూ అవే! బట్టల మీదా అవే ఎక్కడ చూస్తే అక్కడ అసహ్యం వేస్తూ యీ గొంగళీ పురుగులే!

అంచేత ఇంట్లో పెద్దలూ, పిన్నలూ కూడ గొంగళీ కనిపిస్తేచాలు హత మార్చడం మొదలు పెట్టారు. అట్లాంటిది ఆ వెధవ గొంగళి, క్షుద్రమయిన పురుగు! ఒకటి, యీనాడు నీళ్ళలో కొట్టుగు పోతూంటే ఎవరు రక్షిస్తారు? ఎవరికి ఖాతరు?

ఏట్లో కొట్టుగు పోయే మనిషా?

నీటిలోపడి గిలగిలలాడే మనిషా?

ఏమీకాదు! అది ఒక పురుగు.

అది ఎలాగయినా చావడం కావాలి మాకు ఆ విధంగా వాళ్ళ చేతులతో చంప కుండా, అలా చావడమే వాళ్ళ కందరకీ యిష్టం!

చేతులారా ఎన్నిటినో చంపుతూ పాపం కట్టుగుంటున్నా. యీ ఒక్క దాన్ని చూస్తూచూస్తూ యిలా చావనిస్తే పాపం అంటదని వాళ్ళ భావన.

"జీవహింస చేయరాదు" "ప్రతి జీవి యందు దయచూపుము"—ఇల్లాంటివన్ని పాతపడి, చెరిగిపోతున్న నీతులు,

మలేరియా కాకుండా దోమల్ని చంపు తున్నాం. పంటలు నాశనం కాకుండా మిడతల్ని సంహరిస్తున్నాం. ఇప్పుడు క్రొత్తగా ఆహార ధాన్యాలని తినేస్తున్నా యని ఎలుకల మీద, ప్రజలూ ప్రభుత్వము కూడా పట్టించారు! క్రూర మృగాలని, విష జంతువులని, ఎన్నిటినో చంపు తున్నారు....అంచేత, వాళ్ళ మొక్కలను, అపకారం చేసే యీ గొంగళీ పురుగులని చంపుతేనేం?

మనుషులని, మనుష్యులు చంపుకో లేదా?

రాజ్యాలకోసం-అరాజుల తృష్ణకోసం ఒకర్నొకరు చంపుకుంటున్నారు.

మాటమీద మాట వచ్చి-పొడుచుకు చస్తున్నారు.

డబ్బుకోసం చంపుతున్నారు.

స్త్రీ కోసం చస్తున్నారు.

సారా, అరువు పొయ్యలేదని కొట్టుకు చస్తున్నారు.

ఈ విధంగా ఎన్ని రకాలుగా చంపు కుంటున్నారు? చంపడానికి ఒక కారణం అంటూ ప్రత్యేకంగా వుండ నక్కర్లేదని పిస్తుంది. ఒక బలవంతుడు, బలహీనుడిని తనకు చంపాలనిపిస్తే చాలు చంపేయ వచ్చు.

అదే సిద్ధాంతం. నేడు జరుగుతున్న యుద్ధా లన్నిటికీ అదే సిద్ధాంతం. అంచేత ఆ యింట్లో, వెధవ గొంగళీ పురుగులను చంపుతున్నారని ఎవరడగ వచ్చారు? ఈ హత్యకు ఋజువా? సాక్ష్యమా? కేసా? శిక్షా?

ఆ మాట కొస్తే కుటుంబ నియంత్రణ పేరున భ్రూణ హత్యలనే ప్రోత్సాహిస్తు న్నారు. అసలు, పుట్టక మునుపే హత మారుస్తున్నారు; యీ రోజుల్లో....

భోజనాలకి పిలిచే సరికి అందరూ గొడుగులు వేసుకొని తడవకుండా జాగ్ర త్తగా వెళ్ళారు. అలాగే ఆ గొంగళి పురుగు నీళ్ళలో చుట్టుగుంటూ వుంది— చేతులు కడుక్కుంటున్నప్పుడు చూశారు. యింకా అక్కడే అటూ యిటూ ప్రాకుతూ వుంది. చుట్టూ తిరుగుతూ నీళ్ళకి కొట్టుగు పోతూ, ఆ యింత మేరీ తిరుగుతూంది. ఇంకొంచం ఆటువయిపుగా పోతే పంచ క్రిందికి పోవచ్చు. అక్కడి నీళ్లు పడవు గాని ఆ గొంగళి కేం తెలుసు? వర్షం పడుతున్న వయిపే వెళ్ళడం. నీళ్ళకి కొట్టుగు పోవడం యిలాగే జరుగుతోంది! యింక దానికి విముక్తి ఎప్పుడు?

ఇలా ఆలోచిస్తూ వుంటే దడదడమని

పెద్ద పిడుగు పడిన చప్పుడయింది: అం దరూ ఉల్కిపడి లోపలికి పారిపోయా ఎక్కడ పడిందోగానీ యింటి మీద పి డ్డట్టే అయింది.

వర్షం ఆగకుండా కురుస్తునే వుంది.

చిన్న పిల్ల లక్ష్మి వచ్చి గొంగళి చూసి ఆశ్చర్యంతో ఇంతింత కళ్ళు చేసుకుని.

"అమ్మా బియ్యి లీల్లలో పవి యిందే!"

అంటూ వచ్చిరాని మాట లాడుతూ నీళ్ళలోకి వంగి గొంగళిని చేత్తో తీం బోయింది!

ఎంత వేగిరం వచ్చిందో వాళ్ళ అమ్మ గబగబా వచ్చి.

"అమ్మదొంగా నువ్వా నీళ్ళలో ఆడు తున్నావా? వద్దమ్మా ఉవ్వ వస్తుంది" అని పిల్లను తీసుకొని ఎత్తుగుని—శుభ్రంగా తుడిచి....తీసుకుపోయింది.

వర్షం కొంచెం వెలిసినట్లయింది.

అవతల వీదిలో జనం గొడుగులు వేసుకొని పోతున్నారు. రిక్షాలు చుట్టూ పరదాలు దించేసి పోతున్నాయి. తొక్కు తున్న రిక్షావాడు మాత్రం. చింకి రెయిన్ కోటు వేసుకున్నాడు. ఎవరికివారే వర్షం నుండి రక్షించుకొంటున్నారు. ఆకాశం మబ్బులు వీడిపోయి ఎండ పొడచూప తున్నది.

వేసిన కిటికీ తలుపులు ఒక్కొక్కరు తెరుస్తున్నారు. గుమ్మాలలో నిలుచున్న వాళ్ళు బయటకు చేతులు చాపి వాన తగ్గిం దని తోచగానే బయలుదేరుతున్నారు—

పంచలనుంగి కారేధారలు పోయి బొట్లు బొట్లు పడుతున్నాయి. తడిసిన రెక్కల్ని రెపరెపలాడిస్తూ పక్షులు ఎగిరి పోతున్నాయి. చెట్ల ఆకులలోంచి నీటి బిందువులు ఒక్కొక్కటీ రాలుతున్నాయి.

మళ్లీ మధ్యాహ్నం టిఫిన్‌చేసి, యిప తల చేయి కడుక్కుంటున్నప్పుడు గాని, ఆ గొంగళి సంగతి ఎవరికీ జ్ఞాపకం రాలేదు! - జ్ఞాపకం వుంచుకొని సానుభూతి చూపడానికదేం గొప్ప విషయమా? ఒక అల్పజీవి చస్తేనేం? బ్రతికితేనేం? మరచి పోవడంలో వారి తప్పేమీలేదు!

కాని అది వాళ్ల దృష్టినుండి మాత్రం తప్పిపోలేదు! అదే దారేమో. వచ్చినపుడూ వెళ్ళినపుడూ, చూడకూడ దనుకున్నా చూడక తప్పలేదు!

ఎలా కొట్టుగు పోయిందో గాని కాలువ లోకి కొట్టుగుపోయింది, ఆ గొంగళి-ఒక దొండ ఆకుని కరచుకొని ఆకాలవలో నీళ్ళలో తేలిపోయి వుంది!....కాని ఏం లాభం? చచ్చిపోయి వుంది! పాపం!

ఆధారం దొరికితే ప్రాణం రక్షించు కొందా మనుకుంది. కడకు, ఆధారం దొరి కినా ప్రాణం దక్కించుకోలేక పోయింది. ప్రాణం పోయినా, పోయే వరకూ ఆ ఆధారం కోసం ప్రయత్నించి, ప్రయ త్నించి పట్టుదల వదలకుండా సాధిం చింది! ఆ ఆధారాన్ని పట్టుగొనే-ప్రాణాన్ని అర్పించింది....

బ్రతికే వుంటే—

ఎక్కడో ప్రశాంతమయిన చోటు చూసుగుని—పట్టు కట్టుగొని, నిద్రలో రంగు- రంగుల కలలుకంటూ—అంద చందాలొలికే సీతాకోక చిలుకగా మారి, వయ్యారంగా ఎగిరిపోతూ, పూలలో మక రందాన్ని త్రాగుతూ క్రొత్తజీవితాన్ని గడుపవలసే, అసహ్య మయిన గొంగళి పురుగు అర్థాంతరంగా చనిపోయింది.

ఎన్నాళ్ళయినా మానవుడిలో మార్పుం టుందా?

అతడు చస్తే వచ్చే నష్టం ఏముంది?

సీతాకోకచిలుకగా మారి వృక్షాలకు ఎంతోమేలు చేసే గొంగళిపురుగు— సృష్టిలో కోటానుకోట్ల జీవుల్లో ఒక అంగుళంన్నర జీవి, సానుభూతిలేక, రక్షించేవారు లేక గిలగిలలాడి చస్తే ఎవరికి కావాలి? ఆ లోపల ప్రకృతికిగాని మన కేమి?

కాని స్వార్థపరుడైన మానవుడు చని పోతే సానుభూతి కావాలి, సభలుచేయాలి, ఏడవాలి! వూరేగించాలి, పత్రికలలో వేయాలి! రేడియోలో చెప్పాలి! ఏటేట సంతాపదినాలు చేయాలి:

మానవుడు పోతే ప్రపంచానికి నష్టం లేకపోయినా అ మానవుడు నిర్మించిన ప్రపంచమే కాబట్టి, ఏదో పెద్ద లోటు అను కుంటాం—కాని.

మనిషికయినా, కీటకమయినా, ప్రాణం పోవడం—ఖాయం! మరణం అందరికీ సమానమే.

కాని—

ఆ అల్పమయిన గొంగళి పురుగు కోసం—

ఎవరలా ఏడవలేదు కనీసం విచారిం చనూ లేదు.

సంతాప సభలు జరుపలేదు—

సానుభూతి చూపలేదు—

ఊరేగింపూ సాగలేదు—

పత్రికలలో వేయలేదు, రేడియోలలో గోలపెట్టలేదు—

అంత్యక్రియ లసలే లేవు—

తర్వాత పనిమనిషివచ్చి ఆకాలవను తుడిచి చూడనయినా చూడకుండా, నిర్ల క్ష్యంగా అవతల పారేసింది....దాని జీవి తం అలా అంతమయిపోయింది.

మనిషన్నవాడు ఎవడూ కన్నీరుకార్చక పోయినా ప్రకృతే విలపించి విలపించి, కన్నీటి బొట్లుగా రాలుస్తున్నట్లుగా యింకా నీటిబొట్లు అక్కడక్కడ జారుతూనే వున్నాయి. *

## రక్తదానం

భర్త తో భార్య:—"అలా వృథాగా నల్లులకి,దోమలకి తగలెయ్యకపోతే, చక్కగా సైనికులకి రక్త దానం చెయ్యరాదటండీ!"